## కేటీఆర్, హరీశ్‌రావుకు నీరాజనం

జడ్చర్ల, డిసెంబర్ 24 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బాల రాజు, జైపాల్ యాదవ్‌కు జడ్చర్లలో పార్టీశ్రేణులు ఘన స్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి తండ్రి జంగిరెడ్డి ఇటీవల మృతి చెందగా.. వారి కుటుంబాన్ని పరామర్శించడానికి విచ్చేసిన మంత్రులు గొల్లపల్లి సమీపంలోని బ్లూఫాక్స్ హోటల్ వద్ద టీ తాగేందుకు కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా జడ్చర్లకు చెందిన బీఆర్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి అభిమాన నాయకులతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. నసరుల్లాబాద్ వద్ద ప్రణీల్ చందర్ ఆధ్వర్యంలో 150 మంది మహిళలు గుమ్మడికాయలతో స్వాగతం పలికి దిష్టి తీశారు. 'మళ్లీ మీరే రావాలి.. ఆ దేవుడి ఆశీర్వాదం మీ పైన ఉంటుంది'.. అంటూ మహిళలు ముక్తకంఠంతో అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, లత, చైతన్య, ఉమాదేవి, ఉమాశంకర్ గౌడ్, సారిక, జ్యోతికృష్ణారెడ్డి, శశికిరణ్, మహేశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రణీల్, రఘుపతిరెడ్డి, యాదయ్య, రామ్మోహన్, మురళిమురళి, దానిష్ పాల్గొన్నారు.



నేరళ్లపల్లిలో మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు



బీచుపల్లి నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్రగా వెళ్తున్న విద్యార్థులు

- బీచుపల్లి స్కూల్ నుంచి గద్వాల కలెక్టరేట్ వరకు 19 కి.మీ. పాదయాత్ర
- కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయింపు
- చివరకు పది మంది విద్యార్థులతో మాట్లాడి వెనక్కి పంపించిన కలెక్టర్

# ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు

- వేధింపులు భరించలేకపోతున్నాం
- ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడుతుండు
- మెనూ అమలు చేయడం మరిచారు.. అధికారులు పట్టించుకోవడం లేదు
- బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల ఆగ్రహం





కలెక్టరేట్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించిన విద్యార్థులు

గద్వాల/ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 24 : 'మా ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి.. విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుండు.. విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేస్తూ వేధింపులకు పాల్పడుతుండు.. అతడి నుంచి తమకు రక్షణ కల్పించండి.. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు'.. అని ఆగ్రహంతో బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ బాధలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం పాఠశాల నుంచి గద్వాల కలెక్టరేట్ వరకు 19 కిలోమీటర్లు 100 మందికిపైగా విద్యార్థులు పాద యాత్రగా చేరుకున్నారు. కలెక్టర్‌ను కలవడానికి పెద్ద ఎత్తున రావడంతో గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు గేటు బయటే బైఠాయించారు. విషయం అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో హాల్‌లో కూర్చోబెట్టండి మాట్లాడుతా.. అని చెప్పి గంటకుపైగా కూర్చోబెట్టారు. కలెక్టర్‌కు తమ బాధలు చెప్పుకుందామని వస్తే ఆలస్యం చేయడంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. చివరకు పది మంది విద్యార్థులను కలెక్టర్ తన చాంబర్‌లోకి పిలిచారు. దీంతో వారి బాధలను వెల్లగక్కారు. బీచుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్ గతంలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సమయంలో రెండుసార్లు సస్పెండ్ అయ్యారని, అలాంటి వ్యక్తికి ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారన్నారు. ఎలాంటి కారణాలు లేకుండానే తమను దూషిస్తున్నాడని, అకారణంగా విద్యార్థులపై చేయి చేసుకుంటున్నాడని ఆరోపించారు. అధ్యాపకులు బాగా బోధన చేస్తుంటే వారిపై వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తట్టుకోలేక ఇప్పటికే చాలా మంది విద్యార్థులు టీసీలు తీసుకొని వెళ్లి పోయారని తెలిపారు. అలా ఖాళీగా ఉన్న సీట్లను ప్రిన్సిపాల్ ఇతరులకు అమ్ముకుంటున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తించడంతోపాటు టార్చర్ పెడుతున్నారని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి మెస్ చార్జీల పెంపు మాటలకే పరిమితమైందని, పాత మెనూ అమలు చేస్తున్నారని ఆరోపించారు. మెనూ బాగాలేక చాలా మంది బయటకు వెళ్లి భోజనం చేస్తున్నారని తెలిపారు. గురుకులంలో మౌలిక వసతులు కూడా కరువయ్యాయని, ఒకటి, రెండుకు బయటకు పోవాల్సిందేనని వాపోయారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరోసారి ఆందోళన చేస్తామన్నారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. చివరకు జిల్లా విద్యాశాఖ అధికారి విద్యార్థులతో మాట్లాడి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం వారిని ప్రత్యేక బస్సుల్లో బీచుపల్లి గురుకుల పాఠశాలకు తరలించారు.

### ఖాళీ సీట్లు అమ్ముకుంటుండ్రు



విద్యార్థులు కష్టపడి చదివి ప్రతిభ నిరూపించుకొని రెసిడెన్షియల్‌లో సీటు సంపాదిస్తే చిన్నచిన్న కారణాలకు వారిని వేధిస్తున్నారు. దీంతో వారికి టీసీలు ఇచ్చి పంపిస్తున్నారు. వారి స్థానంలో ఇతర విద్యార్థులకు సీట్లు అమ్ముకుంటున్నారు. నిధులు మంజూరయ్యాయని చెబుతున్నా ఎక్కడ ఖర్చు చేశారో తెలియడం లేదు. డార్మెంటరీలు లేవు. 5వ తరగతి పిల్లలు బాత్‌రూంకు రాత్రి పూట గుట్టపైకి వెళ్తున్నారు. విషసర్పాలు కాటేస్తే ఎవరిది బాధ్యత. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. చేసేది లేక పాదయాత్ర చేపట్టాల్సి వచ్చింది. ప్రిన్సిపాల్ విద్యార్థులతోపాటు అధ్యాపకులను వేధిస్తున్నాడు. దీంతో అక్టోబర్ నుంచి ఫిజిక్స్ లెక్చరర్ వెళ్లిపోయాడు.

- కేశవరెడ్డి, ఇంటర్ విద్యార్థి

### వసతులు లేవు.. మెనూ పాటించరూ..



ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందని చెబుతున్నా వాస్తవ పరిస్థితి మా గురుకులంలో కనిపించడం లేదు. పాత మెనూనే అమలు చేస్తున్నారు. ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేక విద్యార్థులు టీసీలు తీసుకెళ్లారు. అధ్యాపకులు చదువు చెప్పలేక వెళ్లిపోతున్నారు. స్టడీ అవర్స్‌లో వాష్‌రూంకు వెళ్లినా బూతులు తిడుతున్నారు. గురుకులంలో వసతులు కరువయ్యాయి. అయినా పట్టించుకునే నాథుడే లేడు. నీళ్లు తాగేందుకు వెళ్లినా తిట్లు తప్పవు.. పేరెంట్స్ వస్తే కలవనీయడం లేదు. సీనియర్ విద్యార్థులకు ఇప్పటి వరకు ప్రాక్టికల్స్ చేయించలేదు. ప్రిన్సిపాల్ తీరుతోనే గతేడాది 10/10 ఎవరు సాధించలేదు. ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు..

- భరత్‌సింహా, ఇంటర్ విద్యార్థి

### ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి : పల్లయ్య

విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్న బీచుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ గాడి తప్పిందన్నారు. రాష్ట్రంలో బీచుపల్లి గురుకుల పాఠశాలకు గుర్తింపు ఉండేది.. కానీ ప్రిన్సిపాల్ కారణంగా చెడ్డ పేరు వచ్చిందన్నారు. వెంటనే ఆయన్ను సస్పెండ్ చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## మర్రికి ఓదార్పు

- జంగిరెడ్డి చిత్రపటానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల నివాళి
- ముఖ్య నేతలకు గులాబీ శ్రేణుల ఘన స్వాగతం

తిమ్మాజిపేట, డిసెంబర్ 24 : తండ్రిని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పలువురు పరామర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంతకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మహమూద్‌అలీతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు కలిసి ధైర్యం చెప్పారు. తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలోని ఆయన స్వగృహానికి కారు నడుపుకొంటూ కేటీఆర్ రాక పక్కన హరీశ్‌రావు చేరుకొని మాజీ ఎమ్మెల్యే మర్రిని ఆలింగనం చేసుకొని ఓదార్చారు. అనంతరం జంగిరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మర్రి తండ్రి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తల్లి అమృతమ్మను వారు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. దాదాపు గంటపాటు అక్కడే ఉన్నారు. అలాగే ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, కోటిరెడ్డితోపాటు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్కసుమన్, గ్యాదరి కిషోర్, గండ్ర వెంకట రమణారెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రవీంద్రకుమార్, ప్రభాకర్ రెడ్డి, భిక్షమయ్య గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని, బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు.



మర్రి తల్లి అమృతమ్మను పరామర్శిస్తున్న కేటీఆర్



జడ్చర్ల సమీపంలోని బ్లూఫాక్స్ హోటల్‌లో కేటీఆర్, హరీశ్‌రావుతో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

## శాంతికి మారుపేరే యేసుక్రీస్తు

- వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తి బీఆర్‌ఎస్ భవన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వనపర్తి టౌన్, డిసెంబర్ 24 : శాంతికి మారు పేరు యేసుక్రీస్తు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక జనాభా జరుపుకొనే పండుగ క్రిస్మస్ అని అన్నారు. క్రైస్తవులందరు యేసు క్రీస్తు పాపుల త్యాగాల కోసం మరణించి తిరిగి లేచారని గుర్తు చేశారు. అనంతరం వనపర్తి పట్టణంలోని అన్ని చర్చిల పాస్టర్లు, పెద్దలు క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, డాక్టర్ నిర్మలా లివింగ్‌స్టన్, డాక్టర్ రాఘవులు , జనార్దన్, కృపాకుమార్, ఏసన్న, శ్రీకాంత్, గంధం విజయ్, కాళిదాస్, ఎర్నెస్ట్, ఐజక్, జాన్‌మార్కు, బీఆర్‌ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, గులాం ఖాదర్ ,ప్రేమ్‌నాథ్‌రెడ్డి, తిరుమల్, రహీం, రమేశ్ తదితరులు ఉన్నారు.



వనపర్తి బీఆర్‌ఎస్ భవన్‌లో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



జూరాల ఎస్‌ఈకి వినతి పత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## జూరాల ఆయకట్టుకు నీళ్లివ్వాలి

- ఎస్‌ఈకి విజ్ఞప్తి చేసిన బీఆర్‌ఎస్ నేతలు

పెబ్బేరు, డిసెంబర్ 24 : జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుదారులకు యాసంగి పంటల సాగు కోసం వెంటనే నీటిని విడుదల చేయాలని ఉమ్మడి పెబ్బేరు మండల బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జూరాల క్యాంపులోని కార్యాలయంలో ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వానకాలం పంటలు పూర్తి చేసిన రైతులు యాసంగి సాగు కోసం ఎదురు చూస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రె స్వామి, శ్రీరంగాపురం సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరాటంకంగా సాగునీరు అందిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతులకు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. ఇప్పటికే నీళ్లు వదలాల్సి ఉందని, నీళ్లు వస్తాయన్న ఆశతో రైతులు వరి నారుమళ్లనుసిద్ధం చేసుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం బాధ్యతాయుతమైన ప్రకటన చేయక పోవడంతో రైతులు సందిగ్ధంలో పడ్డారని వాపోయారు. జూరాల ప్రాజెక్టులో సమృద్ధిగా నీళ్లు ఉన్నా.. కాల్వల్లో నీళ్లు పారుతున్నా.. పంటలకు మాత్రం ఎందుకు వదలడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసు కొని జూరాల ఆయకట్టుదారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్, ఎల్లారెడ్డి, సుమతి, పార్వతి, గోపిబాబు, వేణు, విశ్వరూపం, రాజశేఖర్, మధు, రమేశ్, వీర స్వామి పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కళ్లకు గంతలు కట్టుకొని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

వనపర్తి టౌన్, డిసెంబర్ 24 : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7800 కోట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేశ్, మాజీ నాయకుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కళ్లకు గంతలు కట్టు కొని విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాల యజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తుండడంతో వారు ఏమి చేయలేక ఇంటి వద్దనే ఉంటున్న పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టు కొని ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు చంద్రశేఖర్, మోహన్, అరవింద్, గణేశ్, శివ, బన్ని, చరణ్, కల్యాణ్, మురళి, బాను, బాలు, ఓంకార్, యుగందర్, చిన్న చరణ్ తదితరులు ఉన్నారు.




వనపర్తిలో కళ్లకు గంతలతో ఏఐఎస్‌ఎఫ్ నిరసన

## దుకాణంపైకి దూసుకెళ్లిన టిప్పర్

గద్వాల అర్బన్, డిసెంబర్ 24 : దుకాణంలోకి మట్టి టిప్పర్ దూసుకెళ్లడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు..

జిల్లా కేంద్రంలోని సంతాన వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా అగ్రహారం రోడ్డు పక్కన వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. మంగళవారం తెల్లవారు జామున మట్టి టిప్పర్ మిఠాయి దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో లోపల నిద్రిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మహిళను మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తరలించినట్లు తెలిసింది. జిల్లాలో కొద్ది కాలంగా మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకుడి అండదండలతో వ్యాపారం సాగుతున్నదని ఆరోపించారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కుర్వ పల్లయ్య

## వసతి గృహాలను పట్టించుకోవాలి

- బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

ఎర్రవల్లి, డిసెంబర్ 24 : బీసీ, ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని, కనీసం వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య విమర్శించారు. మంగళవారం మండలంలోని వల్లూరు ఎస్సీ, ధర్మవరం బీసీ హాస్టళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్ ఆవరణలో చెత్తాచెదారంతో ఉండడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని ధ్వజమెత్తారు. ధర్మవరం హాస్టల్ శిథిలావస్థకు చేరిందని, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. వల్లూరు హాస్టల్‌లో మరుగుదొడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని, ప్రహరీలోపల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నదని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని బయపడుతున్నారని వాపోయారు. వెంటనే సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాధవ్, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేలిన శానిటైజర్ బాటిల్

- ముగ్గురికి గాయాలు

మద్దూర్ (కొత్తపల్లి), డిసెంబర్ 24 : శానిటైజర్ బాటిల్ పేలి ముగ్గురికి గాయాలైన ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు..

మద్దూర్ మండల కేంద్రానికి చెందిన మ్యాతరి భాస్కర్ క్రిస్మస్ పండుగ కోసం ఇళ్లును శుభ్రం చేసే పనులు పెట్టుకున్నాడు. మంగళవారం ఇంట్లో ఉన్న వస్తువులను బయట పెడుతున్న సమయంలో శానిటైజర్ బాటిల్‌ను తీసి పెట్టే క్రమంలో డబ్బా ఒక్కసారిగా పేలింది. దీంతో భస్కర్‌కు తీవ్ర గాయాలు కాగా.. ఇంటి పక్కన ఉన్న మోనప్పగారి రాజు, డబ్బు బన్నీ గాయపడ్డారు. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల ఉన్నవారంతా ఉలిక్కిపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ దవాఖాన తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణపేట వైద్య శాలకు తీసుకెళ్లారు.






గాయపడిన భాస్కర్, పేలిన శానిటైజర్ బాటిల్

### ఎడ్లబండిపై నుంచి పడి చిన్నారి మృతి

తాడూరు, డిసెంబర్ 24 : ఎడ్లబండిపై నుంచి గిర్ర కింద పడి చిన్నారి మృతి చెందిన సంఘటన తాడూరు మండలంలో చోటు చేసుకున్నది. మండలంలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన బాలస్వామి-చెన్నమ్మ దంపతుల చిన్న కూతురు పల్లవి (5) మంగళవారం పొలం వద్దకు ఎడ్లబండిపై బయలుదేరింది. అయితే ఊరు దాటుతున్న సమయంలో బండిపై నుంచి అను ప్రమాదవశాత్తు కిందపడగా బండి గిర్ర పైనుంచి వెళ్లడంతో మృతి చెందింది. దీంతో కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి.

